శిథిలావస్థలో సర్కారు బడులు


శిథిలావస్థలో కలకోవలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల


ఆకుపాములలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల..

- పెచ్చులూడుతున్న భవనాలు
- బిక్కుబిక్కుమంటూ పాఠాలు చెప్తున్న ఉపాధ్యాయులు
- కొన్నిచోట్ల చెట్ల కిందే బోధన
- నూతన భవనాలు నిర్మించాలని వేడుకోలు

మునగాల : మండలంలో ప్రభుత్వ బడులు శిథిలావస్థకు చేరాయి. దశాబ్దాల క్రితం నిర్మించిన పాఠశాలలు కావడంతో భవనాల స్లాబ్ పైపెచ్చులు ఊడుతూ ప్రమాదకరంగా మారాయి. మండలంలోని 22 గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న 27 ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో సగానికి పైగా ఇదే పరిస్థితి నెలకొంది. భవనాలు ఎప్పుడు కులుతాయోనని ఉపాధ్యాయులు, విద్యార్థులు భయాందోళన చెందుతున్నారు. ఉపాధ్యాయులు బిక్కుబిక్కుమంటూ విద్యాబోధన చేస్తున్నారు. కొన్ని పాఠశాలలలో విద్యార్థులకు చెట్ల కిందనే విద్యాబోధన చేస్తున్నారు. ఇక వర్షం పడితే కొన్ని పాఠశాలలు కురుస్తుండటంతో విద్యార్థుల, ఉపాధ్యాయుల బాధలు వర్ణనాతీతం. పాఠశాలలకు ఏళ్ల తరబడి మరమ్మతులు చేపట్టకపోవడంతో పాఠశాలలు అవసాన దశకు చేరుకున్నాయి. ఇప్పటికైనా అధికార యంత్రాంగం యుద్ధప్రాతిపదికన శిథిలావస్థకు చేరుకున్న భవనాలను తొలగించి నూతన భవనాలు నిర్మించాలని, మిగతా వాటికి మరమ్మతులు చేపట్టాల్సిన ఉపాధ్యాయులు, విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు వేడుకుంటున్నారు.


తిమ్మారెడ్డిగూడెం ప్రాథమిక పాఠశాల


కృష్ణానగర్‌లోని ప్రాథమిక పాఠశాల

మరమ్మతులు చేయిస్తాం



మండలంలో కొన్ని పాఠశాలలకు కొన్నేళ్లుగా ఎలాంటి మరమ్మతులు చేపట్టకపోవడంతో శిథిలావస్థకు చేరాయి. వీటిని గుర్తించి మన ఊరు– మన బడి రెండవ విడత కింద నిధులు మంజూరు చేయించి మరమ్మతులు చేపడతాం.

– ఎండీ.సలీమ్ షరీఫ్, మండల విద్యాధికారి, మునగాల

కేజీబీవీలో తరగతి గదులు ప్రారంభం

మఠంపల్లి : మండలంలోని బక్కమంతులగూడెం పరిధిలో గల కస్తూరిబాగాంధీ బాలికల పాఠశాలలో రౌండ్ టేబుల్ ఆఫ్ ఇండియా సంస్థ రూ.20 లక్షలు, స్థానిక మైహోం సిమెంట్స్ పరిశ్రమ రూ.5 లక్షలు, సాగర్ సిమెంట్స్ పరిశ్రమ రూ.5 లక్షలతో నూతనంగా నిర్మించిన అదనపు తరగతి గదులను దాతలు, ప్రజాప్రతినిధులు, అధికారులు మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా దాతలు మాట్లాడుతూ పాఠశాలలో తరగతి గదులు సరిపడా లేకపోవడంతో విద్యార్థుల ఇబ్బందులు గమనించి గదుల నిర్మాణానికి సహకరించామన్నారు. అనంతరం పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. కాగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా అలరించాయి. కార్యక్రమంలో ఎంపీపీ పార్వతీకొండానాయక్, జడ్పీటీసీ జగన్‌నాయక్, ఎంపీడీఓ జానకిరాములు, ఎంఈఓ చత్రునాయక్, ఎంపీటీసీ నాగిరెడ్డి, రౌండ్ టేబుల్ ఆఫ్ ఇండియా సంస్థ చైర్మన్ డాక్టర్ శ్రీహర్ష, మైహోం సిమెంట్స్ పరిశ్రమ అధికారులు శ్రీనివాసరావు, నాగేశ్వరరావు, జగన్నాథరావు, సాగర్ సిమెంట్స్ పరిశ్రమ అధికారులు రమణమూర్తి, హరిదాసు, సుబ్రహ్మణ్యం, తూడి వెంకటరెడ్డి, గుండా బ్రహ్మారెడ్డి, మనోజ్ బన్సాలీ, సోరబ్ దనుక, ప్రిన్సిపాల్ విజయకుమారి, ఉపాధ్యాయులు విద్యార్థులు ఉన్నారు.


అదనపు గదులను ప్రారంభిస్తున్న దాతలు, ప్రజాప్రతినిధులు, అధికారులు

రూ.లక్ష రుణమాఫీ చేయాలని వినతి

గరిడేపల్లి : బీఆర్ఎస్ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీ ప్రకారం రూ.లక్ష రుణమాఫీని ఏకకాలంలో అమలుచేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట సీపీఐ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఐ మండల కార్యదర్శి పోకల వెంకటేశ్వర్లు మాట్లాడారు. ఎన్నికల సమయంలో రైతు రుణమాఫీ చేస్తామని చెప్పిన కేసీఆర్ అధికారంలోకి వచ్చి తొమ్మిది ఏళ్లు గడుస్తున్నప్పటికీ రుణమాఫీ చేయకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. రైతులు బ్యాంకుల్లోకి వెళితే కొత్త రుణాలు ఇచ్చే పరిస్థితి లేదన్నారు. రైతులకు రుణమాఫీతో పాటు ఉచిత విత్తనాలు, ఎరువులు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు కడియాల అప్పయ్య, చేప వెంకన్న, అంబటి గోవిందరెడ్డి, నబిసాహెయబ్, జొన్నలగడ్డ తిరుపతయ్య, పోకల ఆంజనేయులు, వెంకట్‌రెడ్డి, కాశీ తదితరులు ఉన్నారు.


తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేస్తున్న సీపీఐ నాయకులు

నిరుద్యోగులను మోసం చేస్తున్న ప్రభుత్వాలు


కొక్కిరేణిలో పీవైఎల్ మహాసభ పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

మునగాల : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిరుద్యోగులను మోసం చేస్తున్నాయని, ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో పూర్తిగా విఫలమయ్యాయని ప్రగతిశీల యువజన సంఘం (పీవైఎల్) జిల్లా ప్రధాన కార్యదర్శి ధరావత్ రవి ఆరోపించారు. మంగళవారం మండలంలోని కొక్కిరేణిలో పీవైఎల్ రాష్ట్ర 8వ మహాసభల పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి ఇస్తామని చెప్పిన కేసీఆర్ నేటికీ దాని గురించి పట్టించుకోకపోవడం శోచనీయమన్నారు. అధికారంలోకి రాగానే లక్ష ఉద్యోగాలు భర్తీ చేస్తానని చెప్పిన ప్రధాని మోదీ ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటుపరం చేయడంలోనే నిమగ్నమయ్యారని విమర్శించారు. జూలై 4, 5 తేదీలలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లందులో జరగనున్న పీవైఎల్ మహాసభలకు నిరుద్యోగులు, యువత, మేధావులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో పీవైఎల్ డివిజన్ సహాయ కార్యదర్శి పున్నం బ్రహ్మం, డివిజన్ నాయకులు చింతకాయల నాగరాజు, బూరుగొమ్ముల అనిల్, ధరావత్ మధు, వెంకటేష్, పచ్చిపాల మధు, వీరేష్, కోటయ్య పాల్గొన్నారు.

విద్యార్థులలో ప్రతిభను వెలికితీసేందుకే క్విజ్ పోటీలు


రావిపహాడ్ జెడ్పీహెచ్ఎస్‌లో విద్యార్థులను అభినందిస్తున్న హెచ్ఎం, ఉపాధ్యాయులు


మఠంపల్లి : విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేసిన ఎంఈఓ చత్రునాయక్

మఠంపల్లి : విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేందుకే క్విజ్ పోటీలు నిర్వహిస్తున్నట్లు ఎంఈఓ పానుగోతు చత్రునాయక్ అన్నారు. మంగళవారం స్థానిక ఎంఆర్‌సీలో రిజర్వ్ బ్యాంకు ఆఫ్ ఇండియా వారి ఆలిండియా ఫైనాన్షియల్ లిటరసీ– 2023 క్విజ్ పోటీలను హుజూర్‌నగర్ ఎస్‌బీఐ సౌజన్యంతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ పోటీలలో మండలంలోని 7 ఉన్నత పాఠశాలల విద్యార్థులు పాల్గొనగా ప్రథమ స్థానం పెదవీడు, ద్వితీయ మఠంపల్లి, తృతీయ రఘునాథపాలెం ఉన్నత పాఠశాలల విద్యార్థులు సాధించారన్నారు. వారికి ప్రశంసాపత్రాలు అందజేశామన్నారు. ఎస్‌బీఐ అసిస్టెంట్ మేనేజర్ రవీందర్, హెచ్ఎంలు వేణుగోపాల్, శ్రీమన్నారాయణ, రమేష్, రాధ, రామకృష్ణ, రాజు, అశోక్‌రెడ్డి, ఇన్విజిలేటర్ వీరస్వామి, బ్యాంకు సిబ్బంది గోపి, రాము, విద్యార్థులు, తల్లిదండ్రులు ఉన్నారు.

రావిపహాడ్, తుమ్మగూడెం విద్యార్థుల ప్రతిభ

మోతె : రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నిర్వహించిన మోతె, చివ్వెంల మండలాల స్థాయి క్విజ్ పోటీల్లో మండల పరిధిలోని రావిపహాడ్, తుమ్మగూడెం గ్రామాలకు చెందిన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల విద్యార్థులు ప్రతిభ కనబరిచి మొదటి, ద్వితీయ బహుమతులు, ప్రశంసాపత్రాలు పొందారు. మంగళవారం రావిపహాడ్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విజేతలుగా నిలిచిన విద్యార్థులు కె.యశ్వంత్, ఏ.అజయ్‌లను ప్రధానోపాధ్యాయుడు మోతీలాల్, ఉపాధ్యాయులు అభినందించారు.

ఫైలేరియా వ్యాధిగ్రస్తులకు కిట్లు పంపిణీ

నేరేడుచర్ల : నేరేడుచర్ల, పెంచికల్‌దిన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలోని 41 మంది ఫైలేరియా వ్యాధిగ్రస్తులకు మంగళవారం మండల కేంద్రంలో జిల్లా కీటక జనిత వ్యాధుల నివారణ అధికారిని డాక్టర్ వి. సాహితి కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కిట్టులో ఐట్మెంట్, సబ్బులతో పాటు మొత్తం ఏడు రకాల వస్తువులు ఉంటాయని, వ్యాధిగ్రస్తులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారులు సౌమ్య, సీతామహాలక్ష్మి, ఏఎంఓ షాబుద్దీన్, సబ్ యూనిట్ ఆఫీసర్లు శ్రీనివాసరాజు, అంజయ్య, సూపర్‌వైజర్ శ్యాంసుందర్‌రెడ్డి, జయమ్మ, హెల్త్ అసిస్టెంట్లు నరసయ్య, హరికృష్ణ, లింగయ్య, వెంకయ్య, వైద్య సిబ్బంది ఉన్నారు.


ఫైలేరియా వ్యాధిగ్రస్తులకు కిట్లు పంపిణీ చేస్తున్న డాక్టర్ సాహితి

అందుబాటులో ఎరువులు, విత్తనాలు

హుజూర్‌నగర్ : పట్టణంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయంలో రైతులకు ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉంచినట్లు ఆ సంఘం చైర్మన్ వై.శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. మంగళవారం పట్టణంలోని ఆ సంఘం కార్యాలయంలో నిర్వహించిన పాలకవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులకు స్వల్ప, దీర్ఘకాలిక రుణాలు ఇస్తామన్నారు. పాడి గేదెలు, గొర్రెల, కోళ్ల పెంపకం, ట్రాక్టర్, వరి కోత యంత్రాలు, వరి నాటు యంత్రాల కొనుగోలుకు రుణాలు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. అన్ని రకాల వరి, జీలుగ విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు, పవర్ స్ప్రేయర్లు అందుబాటు ధరలో ఉన్నట్లు తెలిపారు. కాగా ఇటీవల మరణించిన డైరెక్టర్ ఇందిరాల పాపయ్య స్థానంలో ఆయన భార్య లక్ష్మీని డైరెక్టర్‌గా నియమిస్తూ పాలకవర్గం తీర్మానించింది. సమావేశంలో వైస్ చైర్మన్ కంచెర్ల మధుసూదన్ రెడ్డి, డైరెక్టర్లు డి.మల్లీశ్వరి, కె.పద్మ, జి.శ్రీను, డి.బ్రహ్మం, జె.నరేందర్, జె.మల్ల మ్మ, సీఈఓ నరేందర్‌రెడ్డి పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న పీఏసీఎస్ చైర్మన్ శ్రీనివాస్

ప్రైవేట్ విద్యాసంస్థల ఫీజుల దోపిడీని అరికట్టాలి

హుజూర్‌నగర్ : కార్పొరేట్, ప్రైవేట్ విద్యాసంస్థల అధిక ఫీజుల దోపిడీని అరికట్టాలని టీజేఎస్, పీడీఎస్‌యూ నాయకులు భిక్షంనాయక్, చందర్‌రావులు కోరారు. మంగళవారం హుజూర్‌నగర్‌లో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. జిల్లాలో ప్రైవేట్, కార్పొ రేట్ పాఠశాలలు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయని, ప్రభుత్వ అనుమతి లేకుండా నిర్వహిస్తున్న పాఠశాలలను సీజ్ చేయాలని డిమాండ్ చేశారు. పలు కార్పొరేట్ విద్యా సంస్థలు విద్యాశాఖ నిబంధనలను తుంగలో తొక్కి విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి వేలకు వేలు ఫీజులు వసూలు చేస్తున్నారన్నారు. విద్యా సంస్థల్లోనే పుస్తకాలు, స్టడీ మెటీరియల్, యూనిఫాం అమ్మకాలు చేస్తూ లక్షలు గడిస్తున్నారని చెప్పారు. ఇప్పటికైనా విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు కోటేష్, సామెల్, మురళి, సాయి, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

వీధుల్లో కుక్కలు.. ప్రజలు బెంబేలు


చిలుకూరులో వీధుల్లో తిరుగుతున్న కుక్కలు


ఎంపీడీఓ కార్యాలయం వద్ద..

చిలుకూరు : ఒకప్పుడు కుక్కలు ఉన్నాయి జాగ్రత్త అని ఏదో ఒక ఇంటికి బోర్డు కనిపించేది. ఇక ఇప్పుడైతే ప్రతి వీధిలో కుక్కలు కనిపిస్తున్నాయి. గుంపులు గుంపులుగా తిరుగుతున్నాయి. దీంతో ప్రజలు వీధుల్లో తిరగాలంటేనే భయభ్రాంతులకు గురవుతున్నారు. గ్రామాల్లోనే కాకుండా చిలుకూరు ఎంపీడీఓ, తహసీల్దార్, పోలీస్‌స్టేషన్, వ్యవసాయ శాఖ కార్యాలయాల వద్ద కూడా కుక్కలు స్వైరవిహారం వివిధ పనుల నిమిత్తం వెళ్లే ప్రజలు భయాందోళన చెందుతున్నారు.. పలు వీధుల్లో కుక్కలు పిల్లలను కరవడంతో గాయాలపాలైన సంఘటనలు అనేకం ఉన్నాయి. కావున సంబంధిత అధికారులు స్పందించి తక్షణమే కుక్కలను పట్టి గ్రామాలకు దూరంగా తరలించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు


అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న శశిధర్‌రెడ్డి, ఎంపీపీ, జెడ్పీటీసీ, తదితరులు


చిలుకూరు : మండల కేంద్రంలోని బస్టాండ్ సెంటర్‌లో గల వీరాంజనేయస్వామి దేవాలయంలో ధ్వజస్తంభం, స్వామివారి విగ్రహాలు ప్రతిష్ఠించి 16 రోజులైన సందర్భంగా మంగళవారం ఆలయంలో పండుగను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు, హోమం నిర్వహించారు. అనంతరం గ్రామానికి చెందిన కొడారు లక్ష్మయ్య, మణెమ్మ వారి కుమారులు భక్తులకు ఏర్పాటు చేసిన అన్నదానం కార్యక్రమాన్ని బీఆర్ఎస్ నాయకుడు శశిధర్‌రెడ్డి, ఎంపీపీ బండ్ల ప్రశాంతికోటయ్య, జెడ్పీటీసీ బొలిశెట్టి శిరీషానాగేంద్రబాబు ప్రారంభించారు. అదేవిధంగా చిలుకూరులోని కాలువ ఒడ్డున గల అభయాంజనేయస్వామి ఆలయంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

సీసీరోడ్డు పనులు ప్రారంభం

హుజూర్‌నగర్ : పట్టణంలోని 12వ వార్డులోని అనుములగూడెంలో రూ.5 లక్షల అంచనా వ్యయంతో చేపట్టిన సీసీ డ్రైన్ పనులను మున్సిపల్ చైర్ పర్సన్ గెల్లి అర్చనరవి మంగళవారం ప్రారంభించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు వెలిగొండ సరితావీరారెడ్డి, కస్తాల శ్రవణ్‌కుమార్, జక్కుల వీరయ్య, కారింగుల వెంకటేశ్వర్లు, వార్డు ప్రజలు పాల్గొన్నారు.

సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి

నేరేడుచర్ల : మండల కేంద్రంలోని ప్రధాన కేంద్రాల్లో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు చిలకరాజు శ్రీను కోరారు. మంగళవారం స్థానిక ఏఐవైఎఫ్ సంఘం కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నేరేడుచర్లలో ఇటీవల రోడ్డు విస్తరణలో భాగంగా సీసీ కెమెరాలను తొలగించారని, వాటి స్థానంలో తిరిగి సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. పట్టణానికి చెందిన స్వచ్ఛంద సంస్థలు, వ్యాపారవేత్తలు, ప్రజాప్రతినిధుల సహకారంతో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని కోరారు. సమావేశంలో ఆ సంఘం నాయకులు శ్రీనివాస్, సీతారాములు, ఆంజనేయులు, నగేష్, జానకిరాములు, గుండాల బాలరాజు తదితరులు ఉన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న చిలకరాజు శ్రీను

అడుగడుగునా గుంత.. వానొస్తే చింత

నడిగూడెం : మండల పరిధిలోని రామాపురంలో 190 సర్వే భూములకు, డంపింగ్ యార్డుకు వెళ్లే రహదారి అధ్వానంగా తయారైంది. దారిపై లోతైన గుంతలు ఏర్పడి, చినుకు పడితే చిత్తడిగా మారుతోంది. దీంతో గ్రామంలోని డంపింగ్ యార్డుకు చెత్త చెదారాన్ని తరలించే ట్రాక్టర్ వెళ్లేందుకు రహదారి సరిగ్గా లేకపోవడంతో ఎకలాస్‌ఖాన్‌పేట గ్రామం మీదుగా అధిక దూరం ప్రయాణించి వెళ్లాల్సి వస్తోందని సిబ్బంది ఆవేదన చెబుతున్నారు. అంతేకాక పొలాల వద్దకు వెళ్లడానికి ఇబ్బంది పడుతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.


గుంతలమయంగా మారిన రహదారి

ఎమ్మెల్యే టికెట్ ఇవ్వాలి

మద్దిరాల : వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే టికెట్ తనకే ఇవ్వాలని రాష్ట్ర గిడ్డంగుల సంస్థ మాజీ చైర్మన్ మందుల సామేల్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ ఉద్యమ కాలం నుంచి పార్టీ బలోపేతానికి కృషి చేశానని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు వెంకన్న, సుధాకర్, ఉప్పలయ్య, నరేష్, తదితరులు పాల్గొన్నారు.

సీఎం కేసీఆర్ రైతుల పక్షపాతి


సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న పీఏసీఎస్ చైర్మన్, రైతులు

కోదాడఅర్బన్ : ముఖ్యమంత్రి కేసీఆర్ రైతుల పక్షపాతి అని కోదాడ పీఏసీఎస్ చైర్మన్ ఆవుల రామారావు అన్నారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభానికి ముందు రైతు బంధును రైతులకు విడుదల చేయడం పట్ల హర్షిస్తూ మంగళవారం కోదాడ పీఏసీఎస్ కార్యాలయంలో సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేసి మాట్లాడారు.రైతు సంక్షేమ కోసం నిరంతరం శ్రమిస్తూ ముఖ్యమంత్రి దేశానికి ఆదర్శంగా నిలుస్తున్నాడని అన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ వైస్ చైర్మన్ బుడిగం నరేష్, డైరెక్టర్లు గుండపునేని ప్రభాకర్‌రావు, సోమపంగు పార్వతి, సీఈఓ మంద వెంకటేశ్వర్లు, రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.

కేంద్ర పథకాలను వినియోగించుకోవాలి

మోతె : ప్రధానమంత్రి నరేంద్రమోదీ నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వినియోగించుకోవాలని బీజేపీ కోదాడ నియోజకవర్గ ఇన్‌చార్జ్ నూకల పద్మావతిరెడ్డి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని సిరికొండ, ఉర్లుగొండ, రావికుంటతండా, కూడలి గ్రామాల్లో బీజేపీ మహా జన్ సంపర్క్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా బీజేపీ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె పాల్గొని మాట్లాడారు. బీజేపీ పార్టీ గెలుపు కోసం కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు బానోత్ శ్రీనునాయక్, రామచంద్రు, వెంకటేశ్వర్లు, సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.


కూడలిలో ప్రచారం చేస్తున్న బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పద్మావతి, నాయకులు

ఉచిత న్యాయ సహాయ న్యాయవాదిగా నరసింహారావు



హుజూర్‌నగర్ : హుజూర్‌నగర్ ప్రథమ శ్రేణి న్యాయమూర్తి కోర్టుకు ఉచిత న్యాయ సహాయ న్యాయవాదిని నియమిస్తూ తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవ అధికార సంస్థ సభ్య కార్యదర్శి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. స్థానిక కోర్టు న్యాయవాది కుక్కడపు నరసింహారావును ఉచిత న్యాయ సహాయ న్యాయవాదిగా నియమిస్తున్నట్లు ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఆయన ఈ పదవిలో మూడేళ్ల పాటు ఉంటారని, స్వతహాగా న్యాయవాదిని నియమించుకోలేని వారికి న్యాయ సహాయాన్ని అందించడమే కాకుండా వారి తరఫున ఆయన న్యాయస్థానంలో వాదించాల్సి ఉంటుంది. నర్సింహారావు నియామకం పట్ల బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సాముల రామిరెడ్డి, అధికార ప్రతినిధి కాల్వ శ్రీనివాసరావు, స్థానిక న్యాయవాదులు హర్షం వ్యక్తం చేశారు.

క్లుప్తంగా

కోదాడ ఆర్టీసీ డిపోలో రక్తదాన శిబిరం


రక్తదానం చేస్తున్న కార్మికులు, యువత

కోదాడఅర్బన్ : తెలంగాణ ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ వి.సజ్జనార్ ఆదేశాల మేరకు మంగళవారం కోదాడ ఆర్టీసీ డిపోలో రెడ్ క్రాస్ సూర్యాపేట వారి సహకారంతో ఇన్‌చార్జ్ డిపో మేనేజర్ సురేందర్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో 28 మంది కార్మికులు, యువత రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ బి.సైదులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలి


మొక్క నాటుతున్న ఎంపీడీఓ వనజ, తదితరులు

గరిడేపల్లి : హరితహారం కార్యక్రమంలో భాగంగా ప్రతిఒక్కరూ మొక్కలు నాటి, పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని ఎంపీడీఓ వనజ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రధాన రహదారి వెంట మొక్క నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలోని 32 గ్రామ పంచాయతీలలో హరితహారంలో భాగంగా మొక్కలు నాటాలన్నారు. కార్యక్రమంలో ఏపీఓ సురేష్, పంచాయతీ కార్యదర్శి రేణుక, ఫీల్డ్ అసిస్టెంటు మేకపోతుల సరిత గౌడ్, పద్మ, శాంతి, అంజమ్మ, కోటయ్య, పుల్లయ్య తదితరులు ఉన్నారు.

ఆలయంలో అన్నదానం


అన్నదానం చేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

కోదాడఅర్బన్ : పట్టణంలోని వీరబ్రహ్మేంద్ర స్వామి దేవాలయంలో కొలువై ఉన్న అభయాంజనేయస్వామి ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారికి పంచామృతాభిషేకం, సింధూరాభిషేకం, ఆకుపూజ, మహర్నివేదన, తీర్థప్రసాద వితరణ చేపట్టారు. దాతల సహకారంతో భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు అంజయ్య, కార్యదర్శి తిరపతయ్య, అన్నదాన నిర్వాహకుడు దేవరశెట్టి హనుమంతరావు, దాతలు పొన్నం యేసు, రామానుజమ్మ, గన్నవరపు వెంకటేశ్వర్లు, వాణి, నిర్మల, వనమా వెంకటేశ్వర్లు, సుధారాణి, ఎలిజాల ప్రదీప్, గీత, వీరేపల్లి రామారావు తదితరులు పాల్గొన్నారు.

పఠనోత్సవంపై అవగాహన


విద్యార్థితో చదివిస్తున్న నోడల్ అధికారి వేణుగోపాల్

మఠంపల్లి : ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులు చదువుకోవడానికి నేర్చుకోవాలి, నేర్చుకోవడానికి చదువుకోవాలని నోడల్ అధికారి రామిశెట్టి వేణుగోపాల్ అన్నారు. మంగళవారం మండలంలోని భీల్యానాయక్‌తండాలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన పఠనోత్సవంలో ఆయన పాల్గొని విద్యార్థులకు పఠనోత్సవంపై అవగాహన కల్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పఠనోత్సవంలో భాగంగా ఒక గంట పా4టు విద్యార్థులచే గ్రంథాలయ పుస్తక పఠనం నిర్వహించడం జరుగుతుందని, దీంతో విద్యార్థులు చురుగ్గా తయారవుతారని తెలిపారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్ఎం కీత శ్రీనివాసరావు ఉపాధ్యాయులు, తదితరులున్నారు.

భవన నిర్మాణ కార్మికులు సద్వినియోగం చేసుకోవాలి


వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న వైద్యసిబ్బంది

హుజూర్‌నగర్‌రూరల్ : మండలంలోని శ్రీనివాసపురంలో మంగళవారం సీఎస్‌సీ హెల్త్ కేర్ సెంటర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేషస్పందన లభించింది. ఈ సందర్భంగా స్థానిక సర్పంచ్ రమ్యానాగరాజు మాట్లాడుతూ ప్రభుత్వం లేబరుకార్డు కలిగిన భవన నిర్మాణ కార్మికులకు ఉచితంగా వైద్య సేవలు నిర్వహిస్తోందని, నిర్మాణ రంగం కార్మికులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం సీఎస్‌సీ హెల్త్ కేర్ సెంటర్ జిల్లా కోఆర్డినేటర్ శ్రావణ్‌కుమార్ వైద్యసేవలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో క్యాంపు కోఆర్డినేటర్ నజీర్‌ఖాన్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.